11

జరుగుబాటు

ప్లాట్‌ఫారం మీదికి ఎట్లా పరుగెత్తికెళ్ళి రైలులో పడ్డానో తెలియదు. కారణమేమీ లేకుండానే, నాన్న చెప్పేదాంట్లో ఎంత నిజం ఉన్నదో ఆలోచించకుండానే తగాదా పడ్డాను. చాలా చిన్నవిషయంమీదనే ఇద్దరమూ తొందర పడ్డాం.

ముక్కుపచ్చలారని పెద్దచెల్లెలు వితంతువయింది. సంవత్సరమయింది...వసుమతికి మళ్ళీ పెళ్ళి చేస్తేనేగాని ఇంటికి రానని నాన్నకు రాశాను. నామాట ఆయన వినలేదు...సంవత్సరం దొర్లిపోయిన తరువాత, అవసరమయిన సంగతి మాట్లాడాలి రమ్మని, నాన్న టెలిగ్రాం ఇచ్చాడు.

ఇంకావేం, నేను చెప్పినట్టు చెల్లెలికి పెళ్లి చెయ్యడానికి నాన్న ఒప్పుకుంటాడని చాలా సంబరపడి స్నేహితుడు సుదర్శనానికి వైర్ ఇచ్చి గుంటూరు వెళ్ళాను.

కాని, నాన్న మారలేదు. నాన్న అభిప్రాయాలు మారలేదు. పైగా అమ్మా, తమ్ముడూ, చెల్లెళ్లూ అందరూ తిట్టారు.

వంశగౌరవ మనీ, ఆత్మాభిమాన మనీ ఇంకా యేమిటేమిటో చెప్పారు...ఆ తిట్లు భరించలేక అర్ధ రాత్ర నయినా లెఖ్ఖ చెయ్యకుండా స్టేషనుకు వచ్చాను. అంతే. పరుగెత్తికెళ్లి రైల్లో కూర్చున్నాను. తెనాలి స్టేషనులో దిగి ఒంగోలుకు టికెట్టు తీసుకున్నాను.

ఆరోజు మెయిలు ఆలస్యం. చలిలో అట్టాగే కూర్చోగా కూర్చోగా మెయిలువచ్చింది. పెట్టెలో కూర్చున్నా నేగాని బుర్రంతా వేడెక్కింది. ఏవేవో ఆలోచన లతో ఒంగోలుదాకా గడిపాను.

మిత్రుడు సుదర్శనం స్టేషనుకు వచ్చాడు. ఇద్దరమూ వాడి బసకు వెళ్లాం. పదేళ్ళనాడు నాన్న ఒంగోలులో ఉద్యోగం చేశాడు. ఊరంతా నాకు తెలిసిందే.

మర్నాడు సుదర్శనం ఆఫీసుకు వెళ్ళాడు. ఏమీ తోచక రైలుస్టేషనుకు బయలుదేరాను. అదిగో ఆ బళ్లూ, రిక్షాల మధ్య నుంచున్న ముసలిదానిని ఎక్కడో చూచాను. గుర్తురావడం లేదు. బాగా ఎరిగున్న మనిషిమాదిరిగా ఉన్నది. దానిచుట్టూ గుర్రబ్బళ్ళవాళ్ళూ, రిక్షాలవాళ్ళూ చేరారు.

ఏమిటేమిటో ఖబుర్లు చెప్పుకుంటున్నారు. ఏమి చెప్పుకుంటున్నారో విందామని వాళ్లకు కొంచెందూరంలో నుంచున్నాను. రైలు వచ్చేవేళకాదు కనుక అంత హడా వుడిగా లేదు.

ఒకళ్ళిద్దరు రిక్షాలవాళ్ళు "రిక్షా కావాలా బాబూ" అన్నారు. వద్దని తలతిప్పి తప్పించుకున్నాను.

"ఏంబాబూ, బాగుండావా?" అన్నది ఆ మనిషి. అప్పుడు గుర్తుకొచ్చింది కోటమ్మ. ఆరోజులలో మా ఇంట్లో పనిచేసిన మనిషి కోటమ్మ.

ఆమెను చూచేటప్పటికే ఆమె గతజీవిత మంతా గుర్తుకొచ్చింది.........

*

* *

కూటికి లేకపోయినా, గుడ్డకు కరువే అయినా కులమంటే అభిమానంగల మనిషి కోటమ్మ. పెద్దపెద్ద చదువులు చదవక పోయినా తండ్రి ఆదుపాజ్ఞలలో పెరిగింది కోటమ్మ. నీతి, ధర్మం అనే పెద్దపెద్ద సంగతు లంతగా తెలియకపోయినా వెకిలిగా తిరిగే మనిషి కాదు కోటమ్మ. కాని, జానెడు పొట్టకోసం, రెక్కలు ముక్కలయ్యేట్టు, రంగారాయుడి చెరువునుంచి మంచినీళ్లు ఊళ్ళోని భాగ్యవంతుల ఇళ్లకు చేరవేస్తుంది.

చచ్చేట్టు నెలపొడుగునా నీళ్లుపోస్తే నెలాఖరుకి ఒక్కొక్క ఇల్లాలు దమ్మిడీ ఇవ్వదు. పదిసార్లు తిప్పించుకుని ఇస్తుంది మరొక ఇల్లాలు. ఇస్తే తీసుకుంటుంది. లేకపోతే పస్తులు పడుకుంటుంది కోటమ్మ. పోట్లాడడం చేతనయితేమాత్రం కడుపు నిండుతుందా యేం!

చిన్నతనంలోనే కోటమ్మకు తల్లి కరువయింది. తెలిసీ తెలియని రాజకీయాలలో క్షణం తీరిక లేకుండా, దమ్మిడీ సంపాదన లేకుండా తిరిగేవాడు తండ్రి. అందువల్ల పస్తులు అలవాటయినవి కోటమ్మకు.

ఒక్కొకరోజు ఎవరికి ఎన్నెన్నిపనులు చేసిపెట్టినా దమ్మిడీ దొరక్కపోతే రాజయ్య బిక్కమొహంవేసుకుని ఇంటికి తిరిగివచ్చి కోటమ్మను చితకకొట్టేవాడు. చితకకొట్టి, అది ఏడుస్తుంటే తనుకూడా గొంతు కలిపి ఏడ్చేవాడు.

రాజయ్యతోపాటే జైలుకు వెళ్ళివచ్చిన సుబ్బారావు ఒకరోజు పొద్దున్నే రాజయ్య దగ్గరకు వచ్చి, "ఏం మామా, కులాసాగా ఉండావా?" అన్నాడు.

"ఆ...అదే కులాసా! రా...రా, ఇట్టా కూచో" అన్నాడు రాజయ్య.

"ఏం? అట్లా ఉన్నావేం? చుట్టకాల్చు" అని పొగాకు కాడ ఇచ్చాడు సుబ్బారావు.

అప్పటినుంచీ రాజయ్య ఉన్నా లేకపోయినా సుబ్బారావు కోటమ్మదగ్గరికి వస్తూపోతూ ఉండేవాడు.

ఆరోజులలో రాజయ్య ఛెయిర్మన్‌గారి మనిషి. ఆయన సహాయంతో రాజయ్య కోటమ్మను సుబ్బారావుకు ఇచ్చి పెళ్ళిచేశాడు. సుబ్బారావుకుకూడా "నా" అనే వాళ్ళెవరూ లేరు. కనుక రాజయ్యఇంట్లోనే కాపరంపెట్టాడు. సుబ్బారావుకూడా రాజకీయాలలోనే తిరిగాడు. అయితే వడ్రంగంపని బాగా తెలుసు. పని అనేది దొరికితే రోజుకు ఎంతలేదన్నా నాలుగయిదు రూపాయలు సంపాదించేవాడు. కాని, పనిదొరకని రోజులే ఎక్కువ!!

సుబ్బారావులండ దొరికిన తరువాత రాజయ్య కొంచెం సుఖపడ్డాడు. నిజానికి సుఖపడవలసిన మనిషి కోటమ్మ.

కాని, సుబ్బారావు సంపాదించిన డబ్బు రాజయ్య సుఖానికీ, ఆ తరువాత సుబ్బారావు సుఖానికీ సరిపోవాలి. ఇంకా మిగిలితే అప్పుడూ కోటమ్మ సంగతి. కాని, సాధారణంగా ఆ డబ్బు వాళ్ళ ఇద్దరి సుఖాలకే సరిపోయేది. కాకపోతే నాలుగు సంవత్సరాల పస్తులబాధ కోటమ్మకు కొంచెం తగ్గింది.

"పోనీలే - ఇట్టా అయినా రోజులు వెళ్ళమారితే అదే చా"లని కోటమ్మ వెయ్యిదేవుళ్ళకు మొక్కుకునేది.

తండ్రి పెత్తనంలో ఇంటిచాకిరీ చెయ్యడమేమీ కష్టమనిపించలేదు కోటమ్మకు. కాని, రోజులతరబడి ఇంటిదగ్గిర ఏకాకి పక్షిగా పడిఉండడమే కష్టమనిపించేది.

చేసేందుకు పనేమీ దొరక్క, తండ్రికి ఎక్కడా దమ్మిడీ దొరకలేదుగదా అని ఎదుటింటి షావుకారింట్లో అంట్లుతోమి, గదులుఊడ్చి, కొంచెం అన్నమూ, పావలా డబ్బులూ జంకుతూ జంకుతూనే తెస్తే తండ్రి చితగకొట్టినందుకే కోటమ్మ ఎక్కువబాధ పడేది. ఆ తరువాత కొన్నాళ్ళు తండ్రికి తెలియకుండానే ఆ యింట్లోనూ ఈ యింట్లోనూ చిన్న చిన్న పనులు చేసి, వాళ్లు ఏమి ఇస్తే అది తీసుకువచ్చి ఇల్లుగడిపేది కోటమ్మ. రాజయ్యకూడా చూచీ చూడకుండా పోయేవాడు. తను బతికిఉండగా కూతురు ఇంకొకరింట్లో చాకిరీచేసి ఇల్లుగడపడం రాజయ్యకు ఇష్టం లేదు. ఎన్నికలలో ఛైర్మన్ పార్టీ ఓడిపోయింది. తన 'ఉద్యోగం' ఊడింది. అదివరకు తనను ఎరిగున్నవాళ్ళు

కూడా మొహం తప్పిస్తున్నారు. మొదటినుంచీ భూమీ పుట్రా లేనివాడు కాదు తను. ఛెయిర్మన్ గోపాలంగారి తోనే చిన్నప్పటినుంచీ స్నేహం. ఆయనతో పాటే జమీం దారుమాదిరిగా తిరగడంతో తనకున్న మూడెకరాలగడ్డా హారించుకుపోయింది. ఆయనతో పాటే రాజయ్యకూడా జెయిలుకు వెళ్ళి వచ్చాడు. గోపాలంగారికి 'జేజేలు' కొట్టి జనం పూలదండలు వేస్తే ఆ గౌరవమంతా తనకు జరిగినట్టే సంబర పడ్డాడు రాజయ్య. కాని... కాలచక్రం గిరగిరా తిరిగి రాజయ్య నిరుపేద కావడంతో అహంకారం, అభిమానం బుసలు కొట్టి పైకివచ్చినయ్. ఎవరిమీదనో చూపించాల్సిన ఉక్రోశాన్ని కోటమ్మమీద చూపించేవాడు రాజయ్య. అందులోనూ తన కూతురు ఆ ఇంటికీ ఈ యింటికీ వెళ్ళి చాకిరీచెయ్యడం రాజయ్యకు గిట్టదు. కాని ఏం చెయ్యగలడూ? కనుకనే కోటమ్మ ఎవరింట్లోనో పని చేసి డబ్బు తెస్తూంటే సరిపెట్టుకు పోగలిగాడు రాజయ్య...

సుబ్బారావు పెత్తనంలో కోటమ్మకు ఆ కష్టం పోయి మరోకష్టం వచ్చింది. రాజయ్య చదువుకోలేదు; సుబ్బారావు మూడవఫారందాకా చదివాడు. రాజయ్య పూర్వకాలపు మనిషి; సుబ్బారావు ఈ కాలపు మనిషి. రాజయ్య మోటుమనిషి; సుబ్బారావుదంతా తెలిసీ తెలియని నాగరికత.

కోటమ్మ ఎవరింటికయినా వెళ్ళి పని చెయ్యడం సుబ్బారావుకు ఇష్టంలేదు. మరి సుబ్బారావు సంపాదనతో ఇల్లు గడవదు. "అదుగో, ఆ కోమటాయనకొడుకుకళ్ళు

ఎప్పుడూ నీ మీదనేనే?!'' అని సుబ్బారావు కోటమ్మను తంతాడు. అంటే కోటమ్మను తన్నే అధికారం రాజయ్య దగ్గరనుంచి సుబ్బారావుకు వచ్చింది.

తిండి పెట్టి 'కొడతా'మంటే 'అట్లాగే తన్నులుతింటా' మనేవాళ్లు భారతనారీమణు లొక్కరేనేమో ఈ ప్రపంచంలో! కనుక కోటమ్మకూడా సుబ్బారావు పెట్టే హింసను సహించేది. సహించి, ఇట్లాగే అయినా రోజులు వెళ్లమారితే బాగుండు ననుకునేది. అనుకుని వెయ్యి దేవుళ్లకు మొక్కుకునేది. కాని, ఆ దెబ్బలకు తట్టుకోలేకపోయేది అప్పుడప్పుడు.

అట్లా రోజులు వెళ్లమారుతుండగా రాజయ్య చెల్లెలి కూతురు వెంకమ్మ ఎవడితోనో లేచిపోయింది. ఏం? తను మాత్రం ఎందుకు లేచిపోరాదూ అనిపించేది కోటమ్మకు. కాని, మరుక్షణంలో ఇంకోసంగతి గుర్తుకు వచ్చేది...

కోటమ్మ పిన్నమ్మకూతురు చిన్నతనంలో ఇట్టాగే ఎవడితోనో లేచిపోయింది. ఆ మోజు కాస్తా తీరిన తరువాత వాడు దాన్ని దిక్కూ మొక్కూ లేకుండా వదిలేశాడు. తిండికి లేకపోతే చాకిరీ చేసుకోవచ్చు. ఓ పూటయినా కడుపునిండా తిని బతకొచ్చు. కాని, చాకిరీ చెయ్యడానికి కూడా పనికిరాకుండా పోయింది తన పిన్నమ్మ కూతురు. ఆఖరికి ఏదో రోగంతో చస్తే, శవాన్ని, స్మశానానికి, మునిసిపాలిటీవాళ్ళు వచ్చి తీసుకువెళ్లారు.

కనుకనే మొగుడు అనవసరంగా అనుమానించి తన్నినా సరే-అల్లుడిచ్చిన డబ్బులతో తాగొచ్చిన తండ్రి

తన్నినా సరే - రెక్కలు ముక్కలయ్యేట్టు చాకిరీచేసి తను తెచ్చిన డబ్బులు వాళ్లిద్దరికే సరిపోయినా సరే ఇట్లానైనా రోజులు వెళ్ళమారితే అదే పదివేలని కోటమ్మ రోజూ వెయ్యి దేవుళ్ళకు మొక్కుకునేది.

కాని, రోజులు అట్లా వెళ్ళమారలేదు. ఇంకో విధంగా వెళ్ళమారినవి. రాజయ్య ముసలివాడయి చచ్చి పోయాడు. ఏడాది తిరక్కముందే తెనాలి కాల్వులలో సుబ్బారావు చచ్చాడు. కోటమ్మజీవితం మళ్ళీ మొదటికి వచ్చింది.

తనేమీ చిన్నదీ చితకదీ కాదు. ముప్ఫయిఅయిదేళ్లు వెళ్ళినవి. ఇంతకాలంగా తిన్న దెబ్బలకు వళ్ళంతా మొద్దు పారింది. ఎముకలన్నీ గట్టిపడినవి. కష్టపడడమంటే భయం అనేది లేకుండా పోయింది. అందుకనే ఇళ్లల్లో పని చెయ్య డంతోపాటు రంగారాయుడి చెరువునుంచి మంచినీళ్లు తీసుకు వచ్చే పనికూడా చేస్తున్నది.

ఓ పూట తిన్నా తినకపోయినా హాయిగా రోజులు గడుస్తున్నవి. ఆరడిచేసి, దాష్టీకంచేసి, అయిందానికీ కాని దానికీ అనుమానించి తన్నేవాళ్లు లేరిప్పుడు. ఇట్లాగేనైనా రోజులు వెళ్ళమారితే బాగుండునని కోటమ్మ వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంటున్నది. కాని, రోజులు అట్లా వెళ్ళమారడంలేదు. తండ్రి పోయినప్పటినుంచీ సుబ్బారావు స్నేహితులందరూ కొంపకు వచ్చిపోతూండేవాళ్లు. సుబ్బా రావు చచ్చింతరువాత కోటమ్మను ఓదార్చడానికి వచ్చినట్టు

వచ్చిన ఆ స్నేహితులలో కొందరివల్ల కోటమ్మకు చాలా కష్టమే వస్తున్నది. ప్రాణంపోయినా సరేగాని అటువంటి నీచానికి మాత్రం ఒడిగట్టరాదన్న పట్టుదలొకటి కోటమ్మలో ఆమెకు తెలియకుండానే హారంవేసుకు కూర్చున్నది.

చెరువునుంచి నీళ్లుతెచ్చే పని పూర్తిచేసుకుని ఆ రోజున కోటమ్మ ఇంటికి తిరిగివచ్చేటప్పటికి షావుకారు రామయ్య ఇంటిముందు నుంచొనిఉన్నాడు. తనను చూచాడు. అయినా చూడనట్టు గడపలోంచి కదలడు.

"దణ్ణాలండీ బాబుగారూ" అన్నది కోటమ్మ, భయంగానే.

"ఏం కోటమ్మా, బాగుండావా?......హీ... హీ..." అన్నాడు షావుకారు. అంతేకాని దోవతొలగడు. తను కొంపలోకి పోవాలి. పదిమంది పోయే దారనయినా ఆయనకు లేదు. ఎట్లా? అయినా నిబ్బరించుకుని, "ఏం బాబూ ఇటొచ్చారూ" అన్నది కోటమ్మ.

"ఆ...ఏంలేదు...చూడూ, ఈ స్థలం నాదగ్గర మీ నాయన అద్దెకితీసుకున్నాడు. కంట్రాక్టుపూర్తయింది. మరీ..."

"...............”

"భయపడమాకు. మరేం ఫరవాలేదు." అంటూ షావుకారు దోవతొలిగాడు. కోటమ్మ తలుపు తాళం తియ్యగానే షావుకారు కూడా లోపలికి వచ్చాడు.

చిరిగిన పాత గోనెసంచీ తీసి దులిపింది కోటమ్మ. దుమ్ము వచ్చి కళ్ళల్లో పడుతుంటే, కళ్లు నలుపుకుంటూ, "ఆ...అదంతా ఎందుకే పిల్లా" అన్నాడు పళ్ళు ఇగిలిస్తూ.

"కూచోండి బాబయ్యా" అని కోటమ్మ పోయి పోయిదగ్గర చాటుగా నుంచున్నది.

అయిదు నిమిషాలు షావుకారు ఇంటి పైకప్పుకేసి చూచాడు. చూచి, నీళ్ళు నమిలి చప్పరించినట్టు "కొంపంతా పడిపోతోంది కోటమ్మా. బాగుచేయించాలి. రెల్లంతా లేచిపోతోంది. గోడలకు చెదులుపడుతోంది" అన్నాడు.

"అవును బాబూ" అన్నది కోటమ్మ.

"మరి ఎప్పుడు రమ్మంటావ్ !"

"నాదగ్గర చిల్లిదమ్మిడీ లేదు బాబూ. రెక్కలు ముక్కలయ్యేట్టు చాకిరీచేసినా పొట్ట నిండడం లేదు."

"ఆ...దానికేంలే?? నువ్వు తలుచుకుంటే డబ్బు పరుగెత్తుకొంటూ రాదూ?" అన్నాడు షావుకారు.

"ఎట్లా వస్తుంది బాబూ?? పనిచేస్తే రాని డబ్బు తలుచుకుంటే వస్తుందా ? సుందర్రావుగారింట్లో నాలుగు నెలలు నీళ్లు పోశా. పన్నెండు రూపాయలివ్వాలి. రేపురా–మాపురా అంటుంది ఆ తల్లి. రాఘవయ్యగారింట్లో పెళ్ళికి వంటపని చేశా. ఆ అమ్మాయికి చక్కటి పిల్లాడుకూడా పుట్టాడు. ఎప్పుడెళ్లినా, 'రేపు రావే' అంటుంది ఆ తల్లి..."

"పాపం...అట్టనా? ఇంకా నాకు తెలియనే తెలియదు కోటీ...ఇదిగో ఈ పదిరూపాయలూ..."

"వద్దు బాబూ, వద్దు. ఇట్టనే ఉండనియ్యండి నన్ను. నా తంటాలు నే పడ్తా. పనేం చెయ్యకుండా మీ డబ్బు ఎందుకు బాబూ నాకు?"

"నీదంతా ఒఠ్ఠి పిచ్చి! నామాటకు సరేనను. రేపటి కల్లా..."

"వద్దు బాబూ...వద్దు. మీరు చాలా మంచివాళ్లు. నన్ను ఇట్టాగే ఉండనివ్వండి. నా వొంట్లో ఓపికుండాలి. దేవుడు చల్లగాచూస్తే నాలుగిళ్ళల్లో పనిచేసుకుని, నాలు గిళ్ళకు నీళ్ళుపోస్తే నా పొట్ట నిండుతుంది..."

"కోటమ్మా...నీ మంచికే చెప్తే నీకు తెలియడం లేదు. నామాటకు ఒప్పుకో. లేదా వారంరోజులలో కొంప ఖాళీచెయ్యి. నీ యిష్టం. వస్తా మరి" అని షావుకారు వెళ్లి పోయాడు, రుసరుసలాడ్తూ. ఆయనకు కోటమ్మంత కూతు రున్నది!!!

షావుకారు వెళ్లింతరువాత కోటమ్మ చాలాసేపు బిగ్గరగాఏడ్చింది. ఎవరు వింటారు ఆయేడ్పు? ఎవరికి పట్టింది? ఆ రోజల్లా తిండి తినలేదు. వళ్ళంతా విరగ్గొట్టినట్టు నొప్పి. అయినా అట్టాగే ఊరంతా తిరిగి రైలుస్టేషనుదగ్గిర కొత్తగా కట్టిన ఇళ్ళల్లో ఒకగది నెలకు మూడు రూపాయల అద్దెకు సంపాదించింది. అట్టాగే, ఉన్నపూట తింటూ, లేనిపూట పస్తు పడుకొంటూ రోజులు గడుపుతున్నది కోటమ్మ.

ఇళ్ళకువెళ్లి పనిచెయ్యడం చాలా చిక్కుగా ఉంటు న్నది. ఇంతవరకూ చిన్నవాళ్ళకే దుర్బుద్ధు లనుకుంటుంటే వయస్సు మీరినవాళ్ళుకూడా అంతేనని తెలిసివచ్చింది.

బజారున తిరిగేవాళ్ళంతా ఇంతేనేమోలే అనుకొంటుంటే, బయటికి చాలా పెద్ద మనుషులలాగా కనిపించే వాళ్ళల్లో చాలామంది కూడా ఇంతేనని తెలియడానికి ఆట్టే రోజులు పట్టలేదు.

అయినా ఇన్నిరకాల కష్టాలుపడిన తను 'పత్తిత్తు' అంటే ఎవరు నమ్ముతారూ? అదంతా అట్లా ఉండగా ఒంట్లో శక్తి ఉడిగిపోతోంది. నీళ్ళు మొయ్యలేక పోతోంది...పిండివిసరడం, ఖారం కొట్టడం వంటి పనులు చెయ్యలేకపోతోంది. చెయ్యకపోతే పొట్ట నిండేదెట్లా? ఏమి చెయ్యాలి? 'ఏమి చేస్తే ఇతరుల దయాదాక్షిణ్యాలపై అంతగా ఆధారపడకుండా బతకవ'చ్చని కోటమ్మ చాలా రోజులు ఆలోచించింది......

ఓ నెల నీళ్ళుమోసిన డబ్బులు చేతిలోకి వచ్చిన తరువాత...ఒకరోజున ఒక సోలెడు శనగపిండి తెచ్చింది. అణా ఎండు మిరపకాయలూ, కానీ ఉప్పూ తెచ్చింది. రెండు అరటికాయలు తెచ్చింది. సవాపావు సెనగనూనె తెచ్చింది. తిండి వండుకోడంకూడా మానేసి తనకు చేతనైనట్టే బజ్జీలు వండి రైలుస్టేషనుదగ్గరికి తీసుకువెళ్ళింది. పన్నెండు గంటలకల్లా రూపాయిన్నర వచ్చింది. తన పెట్టుబడి పోను రూపాయి మిగిలింది. అంతే...అట్లాగే రోజూ ఏదో ఒకటి వండి స్టేషనుకు పట్టుకువస్తుంది. బళ్ళవాళ్ళూ, రిక్షాలవాళ్ళూ, రైలుకెళ్ళేవాళ్ళల్లో కొందరూ ఆమెవద్ద

బజ్జీలూ, గారెలూ, పుణుకులూ, కారంబూందీ కొంటారు. అంతా రొఖ్ఖబేరమే.

కోటమ్మ ముసల్దయింది. అయినా ఆపని మాని వెయ్యలేదు. తనకు చేతనైనట్టే ఏదోఒకటి వండి స్టేషనుకు తీసుకువచ్చి ఇంకా-అంటే అరవయ్యేళ్లు నిండినా-అమ్ముతూనే ఉన్నది. అంతేకాని, పెద్దహోటలుపెట్టి భాగ్యవంతురాలు కాలేదు. తిండికి లేక దిక్కులేనిచావు చావలేదని ఆరోజు అయ్యన్న సెట్టి సత్రందగ్గర ఆమెను చూచినప్పుడు తెలుసుకున్నాను.

కోటమ్మను చూడగానే నాలో కలిగిన ఆవేశం నేను వ్రాయలేను. ఎప్పుడయినా మీరు ఆ ఊరువెళితే రైలుదిగి, స్టేషనులోంచి బయటికి రాగానే గుర్రబ్బళ్ళూ రిక్షాలూ ఆగేచోట ఓచెట్టు క్రింద కోటమ్మను చూస్తారు. అప్పుడు ఎవరినయినా 'ఆ మనిషెవరు' అని అడుగుతారు. ఆమెను ఎరిగున్నవాళ్ళయితే మీకు ఈ కథంతా చెప్తారు.

కోటమ్మ కథంతా గుర్తుకొచ్చిన తరువాత నాన్న అంటున్న ఆత్మాభిమానం అంటే యేమిటో, వంశగౌరవం అంటే యేమిటో నామటుకు నాకు కొంతవరకూ అర్థమయినట్టనిపించింది......